## శిలాఫలకాలను లెక్కించేందుకే

# ప్రతిపక్షాలకు ఐదేండ్లు గావాలె

- మాయమాటల మత్తులో పడొద్దు
- మంచి, చెడు, అభివృద్ధిపై యువత ఆలోచించాలి
- అభివృద్ధివైపు నిలబడాలి
- మంత్రి ప్రశాంత్‌రెడ్డి
- భీమ్‌గల్ మండలంలో రూ. 43 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సికింద్రాపూర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

భీమ్‌గల్, అక్టోబర్ 4 : బాల్కొండ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం తాను ప్రారంభించిన శిలాఫలకాలను లెక్కించేందుకే ప్రతిపక్షాల నాయకులకు ఐదేండ్లు పడుతుందని రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శిలాఫలకాలపై నంబర్లు వేసుకుంటూ వస్తే ఇప్పటివరకు తాను చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమని సవాల్ చేశారు. మండలంలో పలు తండాలు, గ్రామాల్లో ఒక్కరోజే రూ. 43కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపనలు చేశారు. ఇందులో ప్రధానంగా రోడ్లు, గోదాములు, రోడ్ డ్యాములు ఉన్నాయి. ఆయా కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సహకారంతో బాల్కొండ నియోజకవర్గంలో వందల కోట్లతో అభివృద్ధి పనుల పరంపర కొనసాగుతున్నదని తెలిపారు. కొంతమంది అజ్ఞానంతో ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ నిధులని అసత్యాలు మాట్లాడుతున్నారని అన్నారు. కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టిన ట్యాక్స్ నుంచే తిరిగి నిధులు వస్తాయన్నారు. రూ. 100 చెల్లిస్తే అభివృద్ధి కోసమని 40 రూపాయలు మాత్రమే కేంద్ర ప్రభుత్వం ఇస్తుందని ఉదహరించారు. అవి కూడా స్థానిక ఎమ్మెల్యేలు ప్రపోజల్స్ పెడతారని, విచక్షణాధికారం మేరకు ఏ పనులు పెట్టాలనేది ప్రజల అభీష్టం మేరకు ఎమ్మెల్యే నిర్ణయం ఉంటుందని వివరించారు.



ముచ్కూర్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న మంత్రి వేముల

కేంద్రం ఒక్క రూపాయి కూడా అదనంగా ఇవ్వలేదని తేల్చి చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు యువతను తప్పుదోవ పట్టిస్తున్నారని, వారి మాయమాటల మత్తులో పడొద్దని సూచించారు. మంచి, చెడు, అభివృద్ధిపై ఆలోచన చేసే శక్తి యువతకు ఉందని, అభివృద్ధివైపు నిలబడాలని కోరారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా, అసత్య ఆరోపణలు చేసినా బాల్కొండ నియోజకవర్గ అభివృద్ధి ఆగబోదని స్పష్టం చేశారు. మీ అభివృద్ధి కోరుకునే మీ బిడ్డనైనా తనను కడుపులో పెట్టుకొని కాపాడుకోవాలని ప్రజలను కోరారు. మంత్రి వెంట హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుశేఖర్, డీసీసీబీ వైస్‌చైర్మన్ రమేశ్‌రెడ్డి, రైతునాయకుడు కోటపాటి, జడ్పీటీసీ రవి, కమ్మర్‌పల్లి ఏఎంసీ చైర్మన్ గుణ్‌వీర్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు సురేందర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య, సొసైటీ చైర్మన్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



పాండు చెరువులో చేప పిల్లలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే షకీల్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రామ్‌కిషన్‌రావు

# టూరిజం స్పాట్‌గా పాండు చెరువు

- రూ.5 కోట్లతో అభివృద్ధి చేస్తాం: బోధన్ ఎమ్మెల్యే షకీల్

బోధన్, అక్టోబర్ 4: పట్టణ శివారులోని పాండు చెరువును రూ. 5కోట్లతో టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేస్తామని బోధన్ ఎమ్మెల్యే షకీల్ తెలిపారు. పాండు చెరువులో ఆయన బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రామ్‌కిషన్‌రావుతో కలిసి బుధవారం చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చెరువు వద్ద ఉద్యానవనం, బతుకమ్మ ఘాట్ నిర్మించి పర్యాటకులను ఆకర్షించేలా తీర్చిదిద్దుతామన్నారు. బోధన్ నియోజకవర్గంలో మత్స్య కారుల సంక్షేమానికి చేపట్టిన కార్యక్రమాలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివరించారు. గంగమ్మ ఆలయాల నిర్మాణానికి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కరోనా కష్టకాలంలో ప్రజలను కన్నెత్తిచూడని కాంగ్రెస్, బీజేపీ నాయకులు.. ఎన్నికలు రాగానే వస్తున్నారని ఎద్దేశాచేశారు. అలాంటివారిని నమ్మొద్దని సూచించారు. అనంతరం బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే షకీల్ ప్రారంభించారు. పట్టణంలోని వాటర్ వర్క్స్ ప్రాంగణంలో రామ్‌కిషన్‌రావుతో కలిసి మహిళలకు చీరలను అందజేశారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలందరికీ తొమ్మిదేండ్లుగా ప్రభుత్వం చీరలను అందజేస్తున్నదని తెలిపారు. ఎంపీపీ బుద్దె సావిత్రీ రాజేశ్వర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గాండ్ల రవీందర్‌యాదవ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగారాం, శివాలయం చైర్మన్ బుజ్జి, బీఆర్‌ఎస్ నాయకులు, మత్స్యకారుల సొసైటీ అధ్యక్షుడు కోట అబ్బయ్య, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు భూమయ్య, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్‌లో కాంగ్రెస్ నాయకుడి చేరిక..**

పట్టణంలోని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పూజారి లింగం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయనకు ఎమ్మెల్యే షకీల్ శాలువాతో సన్మానించి పార్టీలోకి ఆహ్వానించారు.



నాయకుడిని బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే షకీల్





బతుకమ్మ చీరలను అందజేస్తున్న ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా, మేయర్ నీతూకిరణ్

## ఎమ్మెల్సీ కవిత కృషితోనే

# బతుకమ్మ పండుగకు గుర్తింపు

- బతుకమ్మ చీరలను పంపిణీ చేసిన అర్బన్ ఎమ్మెల్యే బిగాల

ఖలీల్‌వాడి, అక్టోబర్ 4 : తెలంగాణ ఆడబిడ్డలు సంబురంగా నిర్వహించుకునే బతుకమ్మ పండుగ ఉమ్మడి రాష్ట్రంలో నిరాదరణకు గురైందని, భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత కృషితోనే బతుకమ్మకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు వచ్చిందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా అన్నారు. అన్ని వర్గాల సంస్కృతి, సంప్రదాయలకు సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. నగరంలోని మహిళా కార్పొరేట్లకు మేయర్ నీతూ కిరణ్‌తో కలిసి బుధవారం బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆడబిడ్డలు సంతోషంగా జరుపుకొనే బతుకమ్మ పండుగను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నదని తెలిపారు. ఆడబిడ్డలకు సీఎం కేసీఆర్ బతుకమ్మ సారెగా చీరలను కానుకగా అందజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మేయర్ ఆకుల సుజాత, బీఆర్‌ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు గంగామణి, ఎస్టీ సెల్ అధ్యక్షురాలు చాంగుబాయి పాల్గొన్నారు.

# కేసీఆర్ ఫ్యామిలీని విమర్శిస్తే బట్టలూడదీసి కొడతాం

- బాండ్ పేపర్ ఎంపీ అర్వింద్‌కు ఇక పొలిటికల్ ఎండ్ పేపర్
- పసుపు బోర్డు ఓ బూటకం.. ఎన్నికల నాటకం
- మొన్న ఇయ్యమన్నోళ్లు.. ఇప్పుడెట్ల ఇస్తమంటున్నరు?
- విలేకరు సమావేశంలో ప్రధాని, ఎంపీపై ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆగ్రహం





విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఖలీల్‌వాడి, అక్టోబర్ 4 : సీఎం కేసీఆర్ కుటుంబంపై అనవసరంగా నోరు పారేసుకుంటే బట్టలూడదీసి కొడతామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి హెచ్చరించారు. పసుపు బోర్డు తెస్తానని బాండ్ పేపర్ రాసిచ్చిన అర్వింద్‌కు అది పొలిటికల్‌గా ఎండ్ పేపర్‌గా మారిందన్నారు. అందుకే చెత్తబుట్టలో పడేసిన బాండ్ పేపర్‌తో మరోసారి ఎన్నికల నాటకం ఆడుతున్నారని మండిపడ్డారు. అయినా బీజేపీని ఇక రైతులు నమ్మే స్థితిలో లేరని అన్నారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రధాని, ఎంపీపై నిప్పులు చెరిగారు. జిల్లాలో అర్వింద్ ఎక్కడ కనబడినా తాట తీస్తామని హెచ్చరించారు. దమ్ముంటే ఆర్మూర్‌లో తన మీద పోటీ చేయాలని, డిపాజిట్ కూడా దక్కనివ్వనని సవాల్ విసిరారు. బీజేపీ కమలదళం కాదని, హమ్లా దళమని పేర్కొన్నారు. తెలంగాణ ఆత్మగౌరవంపై గుజరాతీ గుండాయిజానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. మోదీ బాహర్ వాలా అని.. కేసీఆర్ ఘర్‌వాలా అని అన్నారు. ఇక్కడ మోదీ ఆటలు సాగనివ్వబోమని స్పష్టం చేశారు. సూటూ, బూటు, నోటు, ఓటు.. మోదీ సిద్ధాంతమని, నీళ్లు, నిధులు, నియామకాలు కేసీఆర్ సిద్ధాంతమని అన్నారు. కేసీఆర్ అంటే నమ్మకం, మోదీ అంటే అమ్మకం అని తెలిపారు. పసుపు బోర్డు ఓ ఎన్నికల నాటకమని, పవిత్రమైన పసుపును బజారుకీడ్చిన బీజేపీ మట్టి కొట్టుకుపోతుందన్నారు. దేశంలో బీజేపీకి ఎదురుగాలి వీస్తోందని తెలంగాణలో ఒక్క చోటకూడా డిపాజిట్ రాదన్నారు. కవిత ఎంపీగా ఉన్నప్పుడు పసుపు బోర్డు కోసం తొక్కని గడపలేదని, మొక్కని దేవుడు లేదని గుర్తుచేశారు. నిన్నటి వరకు ఇవ్వలేమన్న పసుపుబోర్డు.. ఇప్పుడెలా సాధ్యమైందని ప్రశ్నించారు. రైతులపై ప్రేముంటే మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజనపై మోదీ విషయం కక్కని రోజు లేదని, తెలంగాణ చావు చూసే దాకా నిద్ర పోకూడదన్నంత ద్వేషం పెంచుకున్నాడని ఆరోపించారు. ఓట్లు దండుకోవడానికే నేడు తెలంగాణలో ఊరేగుతున్నాడని ఎద్దేవా చేశారు. సింగరేణి గనులు సహా పదేండ్లుగా సీఎం కేసీఆర్ సృష్టించిన అపారమైన సంపదను అదానీకి దోచిపెట్టాలనే దుర్బుద్ధి మోడీలో కనిపిస్తున్నదని అన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను సర్వనాశనం చేసిన బీజేపీ ఒక డర్టీ పిక్చర్ అన్నారు. ఎలక్షన్ మూవీలో మోదీ అనేక వేషాలేస్తున్నారని ఎద్దేవా చేశారు. నేతి బీరకాయలో నెయ్యి ఉండదని, మోదీ మాటల్లో నిజం ఉండదని విమర్శించారు.